

# సినిమా సైకాలజీ

ముదిగొండ వీరభద్రయ్య

ఆ వూరు చిన్నదే. ఐనా ఆ ఊర్లో సాంస్కృతిక కార్యక్రమాలూ, ఉత్సవాలూ నెలకో రెండయినా జరుగుతుంటవి ఆ వూరి ఐశ్వర్యవంతుడు నాగభూషణం గారు ఏ కార్యక్రమంలో పాల్గొంటారో ఆ కార్యక్రమం విజయవంతమయినట్లు లెక్క. నాగభూషణంగారికి బోల్డుమంది అనుయాయులు. వారి ఉపన్యాసంలోనూ, ఉపన్యాసానంతరమున్నూ సముద్ర ఘోష లాగా చప్పట్లు వినబడుతుంటవి. ఇంతెందుకు ఆ వూర్లో ఒక చలనచిత్ర శతదినోత్సవంలో పాల్గొనడానికి వచ్చిన సినీ తారలకన్నా ముందే నాగభూషణం గారే మాట్లాడాలని సభికుల్లో కొందరు గట్టిగా కోరడంతో చివరకి కార్యనిర్వాహకులు అలాంటి ఏర్పాటు చేయాల్సి వచ్చింది! ఆయనకి ఆ వూర్లో సినిమా తారలకన్నా ఎక్కువ కీర్తి ప్రతిష్ఠ లున్న వనడానికీ విషయం చెప్పాల్సి వచ్చింది.

ఇంతటి ప్రశంసకి పాత్రుడైన నాగభూషణం వయస్సు ఏ యాభయ్యో అరవయ్యో వుంటుందనుకొంటే మీ అంచనా పొరపాటే! అతని వయస్సు ముప్ఫయి అయిదేళ్లు దాటవు. అతను ఇంట్లో రోజూ పట్టుపంచె కట్టుకొని మొఖాన కుంకుమ బొట్టు పెట్టుకొని లక్ష్మీదేవి పటాలకి పూజ చేస్తాడు. పటాలకని ఎందుకంటున్నానంటే అతనికి నాలుగు రైస్ మిల్లులూ, ఒక్క బట్టలమిల్లూ, ఒక సిగరెట్టు ఫ్యాక్టరీ, ఒక పెట్రోలు కంపెనీ ఏజన్సీ వున్నవి — ఇవన్నీ వెరసి ఏడు సంస్థలు కాబట్టి ఏడు లక్ష్మీదేవి పటాల్ని (వ్యాకరణం తప్పుకదూ — దయ చేసి క్షమించండి) తనింట్లో పూజా మందిరంలో వేలాడదీసి — (ఉరికంబానికి కాదు సుమా...) మేకులకి — భక్తితో రోజూ పూజ చేస్తాడు నాగభూషణం.

నాగభూషణం లక్షాధికారి. కాని నిజానికి నాకీ లక్షాధికారి అన్నపదంతో కల్గాల్సిన సంతృప్తి కలగడం లేదు. ఐనా లక్షాధికారి అంటే నాగభూషణం కోటీశ్వరుడు కాదని ఎక్కడా అర్థంలేదు! కోట్లని కూడా లక్షల లెక్కల్లో వ్రాయ వచ్చును. మాటొక్క లక్ష అంటే కోటి పైననే కదా అర్థం! నాగభూషణం కూడా నిజానికి అలాంటి లక్షాధికారే! కాని వెధవది ఇంగ్లీషువాడు ఈ దేశాన్ని ఏలినప్పటినుంచీ కోట్లకి అర్థం మారి పోయింది. కాబట్టే నేను నాగభూషణాన్ని కోటీశ్వరుడనడం లేదు. చెప్ప వచ్చిం దేమిటంటే నాగభూషణాన్ని లక్షాధికారి అంటే ఏదో మూరు లక్షలలోపునే అని ఊహించేరు! అలా కాదని చెప్పడానికే ఇదంతా వ్రాస్తున్నాను... ఆ మధ్యలో బేంకుకి నాగభూషణం పంపిన మూరు రూపాయల నోట్ల కట్ట వకటి ఇంటికి తిరిగి వచ్చి చాలా గొడవచేసిందని వినికిడి! ఇది ఒట్టి వినికిడే సుమండీ! అవతలి వూర్లో వారికికేమీ తెలియవు.

నాగభూషణానికి భార్య లేదు. ఆమె చచ్చిపోయింది. ఆమెపై అతని ప్రేమకి చిహ్నంగా అతని పడకగదిలో ఆమె ఫోటో వకటి వ్రేలాడదీసి వుంటుంది. దాని ముందర జీరోవాట్ బల్బ్ ఒకటి ఎప్పటికీ వెలుగుతుంటుంది (నిత్యదీపారాధన???!)

ఆవేళ దేవతాపూజ చేసి డ్రెస్ చేసికొని డ్రాయింగ్ రూమ్‌లోకి రాగానే నాగభూషణాన్ని చూసి ఓ ఇద్దరు వ్యక్తులు లేచి నుంచొని వచ్చీ రాని తెలుగులో తమ నమస్కారాల్ని చెప్పారు.

'ఎవరు మీరు? ఏం పనిమీద వచ్చారు?' ఎంతో ప్రసన్నంగా అడిగాడు

నాగభూషణం.

'మేం సర్కస్ కంపెనీ వాళ్ళం. మీ వూళ్ళో ఈ వచ్చే సన్‌డేనుంచి సర్కస్ ఆడిస్తున్నాం. ఇనాగ్యురల్ ఫంక్షన్‌కి మీరు ప్రెసిడెంట్‌గా వుండాలని కోరడానికి వచ్చాం సార్!'

'ఓ యస్!' అన్నాడు నాగభూషణం. అతని తీరంతే. ఇంతవరకెన్నడూ ఏ కార్యక్రమానికీ ఆయన నిరాకరించినట్లు గుర్తు లేదు. అంతేగాక— 'నాకు వీలులేదు. ఫలానావాళ్ళని అడిగి చూడకపోయారా?'— అని ఆయన ఎన్నడూ అనలేదు.

ఆ ఆదివారం రానే వచ్చింది. ప్రారంభోత్సవం రాత్రి ఏడున్నర గంటలకి. సర్కస్‌వాళ్ళు ఐదున్నరకే వచ్చి నాగభూషణాన్ని తీసికెళ్ళారు. అక్కడ అతనికి అందర్నీ పరిచయం చేశారు.

'వీరు మా బఫూన్'

'నమస్కారం' అన్నాడు నాగభూషణం నిర్లక్ష్యంగా.

'వీరు మా హెవీ వెయిట్ ఛాంపియన్'

ఆ వ్యక్తి బలిష్ఠమైన దేహాన్ని చూస్తూ చిరునవ్వుతో నమస్కరించాడు నాగభూషణం.

'ఈయన మా అనిమల్ ట్రెయినర్'

పై - సవరించుకుంటూ నమస్కరించాడు నాగభూషణం.

'ఇతను ఫిష్ మింగి మళ్ళీ కక్కుతాడు...ఇతను మోటార్ జంపింగ్...... ఇతను మృత్యుమండలంలో మోటార్‌బైక్ డ్రైవింగ్ ... ఇతను కత్తుల బోనులోంచి దూకడం...' అతనిలా మొగాళ్ళ నందర్నీ పరిచయం చేస్తూ చివరకి లేడీ ఆర్టిస్టుల దగ్గరకి వచ్చాడు.

'ఈమె మిసెస్ శాంతి.'

'నమస్కారం.'

'ఈమె మిస్ మేరీ'

'మరి మిసెస్ శాంతి ఏ ఫీట్స్ చేస్తుంది?' మిస్ మేరీ ముందర నిలబడి పక్కగా రోబ్స్‌లోనుంచే కనిపిస్తున్న మిసెస్ శాంతి శరీరపు వంపుల్ని తన వైపే చూస్తున్న ఆమె విశాలనయనాల్నీ చూస్తూ అడిగాడు నాగభూషణం.

ఆ ప్రశ్నకి మిసెస్ శాంతి నవ్వింది.

'ఆమె చెయ్యని ఫీట్స్ లేవండీ! ఆమె ఒక రకంగా మా సర్కస్ ఫ్యామిలీకి తల్లి వంటిది.'

'ఆమెకంత వయస్సు వున్నట్లు లేదే?' అంటూ ఆమె స్నిగ్ధ శరీరాన్ని యెంతో సౌందర్య దృష్టితో చూశాడు నాగభూషణం.

'ఈమె మిస్ రోజా...మిస్ కమల... మిస్ పద్మ...బేబీ రాణీ...బేబీ డైసీ.'

పరిచయాలు ముగిసినవి.

అంతలో ఆ బారులోంచి మిసెస్ శాంతి ముందుకి నడిచి వచ్చి 'రండి నాగభూషణంగారూ! మా టెన్ట్ చూపిస్తాను' అని అన్నది. నాగభూషణం ఆమె వెంట ఉత్సాహంగా నడిచాడు.

'ఈ టెంట్‌లో మా ఫామిలీ వుంటుంది. ఇవి ఏనిమల్ సైకాలజీ మీద పుస్తకాలు' ఫ్లాస్క్‌లో నుంచి ఒక కప్పులోకి పాలు వంచి అతని చేతికి అందించింది ఆమె. పాలకప్పుని అందుకొన్నాడు నాగభూషణం.

దగ్గర నుంచి దుర్వాసన గాఢంగా వీస్తోంది. బహుశః పెద్దపులుల బోన్లలోంచి వస్తోంది కావచ్చు ననుకొన్నాడు నాగభూషణం.

సర్కస్ డేరా బైట జనం మూగుతున్నారు. సూర్యుడస్తమిస్తున్నాడు.

నాగభూషణం పాలు తాగాక అతణ్ని టెన్ట్ బైటకు తీసుకొచ్చింది మిసెస్ శాంతి. బోన్లలో వున్న పెద్ద పులుల్నీ— సింహాలనీ—దూరంగా కట్టేసిన ఏనుగుల్నీ గుర్రాల్నీ ఒంటెలనీ చూపించిందామె. అన్నీ చూశాక ఎంతో సంతోషంతో 'థాంక్స్ మిసెస్ శాంతీ! మీదీ వో పెద్ద కుటుంబమే!' అంటూ ఆమెని వోరగా చూశాడు నాగభూషణం.

డేరామీద క్షణక్షణానికీ వెలుగుతూ ఆరుతూ వున్న దీపాల మాయ వెలుతురులో మిసెస్ శాంతి నాగభూషణం హృదయంలో అశాంతిని రేపిందని వేరే చెప్పాలా?

'పదండి! డేరలోకి వెళ్దాం. టైమైనట్లుంది' అన్నది శాంతి.

రికార్డుల పాటలు అసహ్యంగా మోగుతున్నవి మాయ వెలుతుర్లో నడక తడబడి నాగభూషణం మిసెస్ శాంతిమీద పడబోయాడు. ఆమె అతణ్ని పడకుండా నిలబెట్టింది!

'మిక్కుఉదయమంతా తిరికే అనుకొం' చాను' అన్నాడు నాగభూషణం.

దగ్గరలో సర్కస్ కళాకారుల గుంపులు కనబడుతున్నవి.

'అవునండీ నాగభూషణంగారూ!'

'ఐతే మా కారు పంపుతాను. ఒకసారి మా ఇంటికి టీకి రండి.'

'తప్పక వస్తాను.'

ఆకాశంలో చందమామ వ్రేలాడ పోతున్నాడు. పైనున్న చుక్కలు చందమామని పైకి లాక్కోలేక మొగాలు వ్రేలాడేసినట్లుగా బలహీనంగా మెరుస్తున్నవి.

డేరాకి చుట్టూతా కట్టిన టిన్ రేకుల దడి బైటనుంచి జనసముద్రఘోష వినిపిస్తోంది. దుమ్మూ ధూళీ పైకి లేచి ముక్కుల్లోకి పోతోంది.

ఆర్. డి. ఓ., డి. ఎస్. పి. వంటి ప్రముఖ ఆఫీసర్లందరూ వచ్చివున్నారు. కార్యకర్తలు నాగభూషణాని కెదురుగా మైక్ తెచ్చిపెట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమని ఆవూర్లోని ప్రజలంతా ఆదరించవలసిందిగా ప్రార్థించారు వాళ్ళు. అధ్యక్షుడైన నాగభూషణం మాట్లాడుతూ

'సర్కస్ ఒక దివ్యకళ [కవిత్వ మొక దివ్యకళ అని తిక్కనగారన్న మాటల్ని నాగభూషణం సమయానుకూలంగా చలన చిత్ర శత దినోత్సవాల్లో నటన ఒక దివ్యకళ అనీ, లారీ డ్రైవర్ల యూనియన్ సభలో డ్రైవింగ్ ఒక దివ్యకళ అనీ, హోటల్ సర్వర్ల సభలో మాట్లాడుతూ సర్వింగ్ ఒక దివ్యకళ అనీ మార్చుకుని ఇదివరకే మాట్లాడి వున్నారు...] దాన్ని పోషించడం మనందరి బాధ్యత. ఇవేళ ఈ కళాకారులందరూ తమ కళానైపుణ్యంచేత మనల్ని మెప్పిస్తారనడంలో నాకు సందేహం లేదు [!] ఇప్పుడే వాళ్ళందరితో నాకు పరిచయమైంది[!] వాళ్ళంతా అమృత హృదయులు, దివ్య శరీరులు. వాళ్ళని చూస్తుంటే నేనూ ఈ సర్కస్ కంపెనీలో ఒక కళాకారుణ్ణి అయివుంటే ఎంత బాగుండేది? అనిపిస్తోంది. కాని నాకంత అదృష్టం వుందా? లేదు! లేదు! లేదు! ముమ్మాటికీ లేదు!' (వెరసి ఏడు లేదులు!) ......ఇలా సాగింది నాగభూషణం వుపన్యాసం చిట్టచివరకి అతని వుపన్యాసం ఇలా ముగిసింది.

'ఈ ప్రారంభోత్సవానికి నేనో కొత్త

కార్యక్రమం చేరుద్దామనుకొంటున్నాను' సర్కస్ కంపెనీ సమస్యల్ని గురించి ఎవరైనా సర్కస్ కళాకారుడు ఉపన్యసిస్తే మంచిదేమో! ముందుగా తెలుపకున్నా అందుకై నేను ఈ సర్కస్ కంపెనీ కళాకారిణి మిసెస్ శాంతిని ఇక్కడకు వచ్చి ఉపన్యసించ వలసిందిగా ఆహ్వానిస్తున్నాను.'

డేరాలో చప్పట్లు చెలరేగినవి. ఈ ఆకస్మిక పరిణామానికి సర్కస్‌కంపెనీ వాళ్ళు ఆశ్చర్యపడిపోయారు! కాని మిసెస్ శాంతి హుందాగా నడుస్తూ మైక్‌వద్దకు వచ్చింది.

నాగభూషణం కళ్ళకి ఏకాగ్రత!

మిసెస్ శాంతి సభికులకి నమస్కరించి 'డియర్ ప్రెసిడెంట్! నాల్గంటే నాల్గే వాక్యాలు మాట్లాడ్తాను. మీరన్నట్లుగా సర్కస్ దివ్యకళకాదు. అదొక మృత్యుకళ. చావు బ్రదుకుల బౌండరీలో ఒక్క ముద్ద తిండికోసం మేం బ్రతుకుతున్నాం. మా సమస్యల్ని గురించి చివరిరోజున—బహుశః ఈ కంపెనీకే అది చివరిరోజు కావచ్చు—నేను ఉపన్యసిస్తాను'

ఈ మాటలని ఆమె హుందాగా నడిచి వెళ్ళింది.

చప్పట్లు మోగినవి.

కాని ఈ చప్పట్లలో ఏదో విషాదభారం వున్నట్లున్నది దానికి శృతిగా బ్యాండ్ మోగింది. కళాకారిణులందరూ రంగు రంగుల దుస్తులతో మధ్య సర్కిల్‌లో పతాకాలెత్తుకొని తిరిగారు.

సర్కస్ ఫీట్లని జనం చాలా చాలా కుతూహలంతో ఏకాగ్రతతో చూస్తున్నారు. ఎన్ని ఫీట్లు చూసినా మిసెస్ శాంతి వచ్చి ఏ ఫీట్ చేయకపోవడం నాగభూషణానికి చిరాకెత్తించింది. చివరకి చేసేదేమీ లేక కళాకారిణుల మనువుదేరిన బలిష్ఠ దేహాల్ని చూస్తూ కూర్చున్నాడు నాగభూషణం.

మొదటి ప్రదర్శన అయిపోయింది. తమ ప్రదర్శనల్ని విజయవంతం చేయాలని మైక్ లోంచి జనాన్ని ప్రార్థించాడు ఆ కంపెనీకి చెందిన ఒక మనిషి.

ప్రేక్షకులందరూ లేచారు. రణగొణ ధ్వని చెలరేగుతోంది' గుడారమంతా ధూళీ దుబ్బాం. కర్చీఫ్‌తో ముక్కు మూసికొన్న నాగభూషణం కళ్ళు ఎవరికోసమో ఆత్రుతగా వెదకుతున్నవి. కాని అతనికి నిరాశే ఎదురయింది. ఇంతలో ముసలి బఫూన్ వచ్చి అతని



చేతిలో ఒక కాగితంపెట్టి వెళ్ళాడు. నాగభూషణం కాగితం విప్పి చదువుకొన్నాడు.

'రేపుదయం పదకొండు గంటలకి మీ ఇంటికి వస్తున్నాము.' అని మిసెస్ శాంతి వ్రాసి పంపించింది.

నాగభూషణం సంతోషంతో బైటకు వచ్చి కారెక్కాడు.

మర్నాడుదయమే లేచి పూజలన్నీ ముగించుకొని పదింటికే అతిథుల గదిలోకి వచ్చి కూర్చున్నాడు నాగభూషణం. గడియారంలోని చిన్నముల్లుని పెద్దముల్లు కబళించ ప్రయత్నిస్తోంది.

గడియారం పదకొండు కొట్టింది.

మిసెస్ శాంతి లోపలికి అడుగెట్టింది. ఆమె వెంట బేబీరాణీకూడా వచ్చింది. ఆ పిల్లని చూశాక నాగభూషణానికి కాస్త ఉత్సాహం తగ్గినా తెచ్చుకోలు ఉత్సాహంతో వాళ్ళని లోపలికి ఆహ్వానించి బేబీరాణిని ముద్దుపెట్టుకొన్నాడు. రాణికి తెలుగు రాదని ఒక్కక్షణంలో తెలిసికున్నాడతను.

'రాణి తల్లిదండ్రు లెవ్వరు మిసెస్ శాంతీ?' తన గృహాంతర్భాగాన్ని చూపిస్తూ అడిగాడు నాగభూషణం.

'ఇది మా దేవుడిల్లు'

ముగ్గురూ లోపలికి అడుగు పెట్టారు. నాగభూషణం సాష్టాంగ పడ్డాడు దేవతల ముందర. మిసెస్ శాంతీ, రాణి మౌనంగా నిల్చున్నారు.

'అలా నిల్చున్నారేం? మీరూ నమస్కరించండి.'

'దేనికి?'

'దేవతలకి!' ఆశ్చర్యంగా సమాధాన మిచ్చాడతను.

ఆమె మౌనంగా వుంది.

'మీరు హిందువులు కారా?'

'హిందువులమే? ఐతే?' అడిగింది శాంతి.

'ఐతే దేవతలకి నమస్కరిస్తే వాళ్ళు మిమ్మల్ని కాపాడ్తారు'

'పుట్టినప్పటినుంచీ నేటివరకూ ఎన్నడూ భగవంతుని తలచుకోనైనా లేదు.'

'కాని మీలాంటి వృత్తుల్లో వున్న వాళ్ళకే భగవద్భక్తి ఎంతో అవసరం'

'కాని పని చేసేవాడికి భగవంతుణ్ని గురించి ఆలోచించే తీరిక వుండదు మిస్టర్ నాగభూషణం.'

'అయ్యయ్యో! ఎంత అన్యాయం వాడికి పని ఇప్పించిందే భగవంతుడైతే అలా అనవచ్చా?'

'ఉదాహరణకి నన్నే తీసికోండి. నాకు పనిచ్చినవారు మా మామగారు. ఐతే నాకు ఆయనే భగవంతుడన్న మాట.'

'కాని మిసెస్ శాంతీ! నువ్వు చాలా అజ్ఞానంలో వున్నావు. ఒక్క నాలుగు రోజులు నాతో స్నేహం చేశావంటే నీకే విషయాలు తెలుస్తవి.' అన్నాడు నాగభూషణం.

'సరే మిస్టర్ నాగభూషణం'

వాళ్ళు ముగ్గురూ బైటకు కదిలారు. డైనింగ్‌హాల్లో వాళ్ళు టీ త్రాగారు.

మళ్ళీ మర్నాడు భోజనానికి రమ్మనమని ఆహ్వానించాడు శాంతిని నాగభూషణం...

మర్నాడు మధ్యాహ్నం మిసెస్ శాంతి వచ్చింది. ఇద్దరూ భోజనం చేస్తున్నారు. స్వార్థం లేకుండా ఎక్కడైనా స్నేహం వుంటుందా? ఏదో ఒక అవసరాన్ని తీర్చుకోవడానికి కాకపోతే స్నేహం అనే ఒక పద్దతే పుట్టకపోవును. ఐతే నాగభూషణం మిసెస్ శాంతితో చేస్తున్నది స్నేహం కాదు. ఎందుకంటే నాకు తెలిసినంతవరకు ఏ భారత పురుషుడూ పెళ్ళయిన స్త్రీతో స్నేహం చేయడానికి ఉత్సహించడు. కాదా మరి? చూస్తూ చూస్తూ రిసెర్వ్‌డ్ కంపార్ట్‌మెంట్‌లోకి ఎవ్వడూ ఎక్కడు. అలా చేస్తే రిజర్వ్ చేసుకొన్న వాడూ కండక్టరూ ఇద్దరూ ఊరుకోరు. కాని ఇదో ఎక్సెప్షన్. ఇక్కడ మిసెస్ శాంతిని చూడగానే అతను ప్రపంచాన్నే మర్చాడు. ఆమె శ్రీమతి అయివుండడం పెద్ద అడ్డంకి కాదు—పది మందిలోకి అర్ధనగ్నంగావచ్చి దొమ్మరాటలు ఆడే స్త్రీకి పెద్ద వ్యక్తిత్వమూ వుండదు! అథవా వున్నా ఆ వ్యక్తిత్వాన్ని డబ్బుతో కొని నిర్వీర్యపర్చలేడా తాను? — అనుకొన్నాడు నాగభూషణం.

భోజనాలు ముగిసినవి. తన బెడ్‌రూమ్‌లోకి శాంతిని తీసికెళ్ళాడు నాగభూషణం.

అక్కడ వేలాడేసిన ఫోటోని చూపిస్తూ,

'ఈవిడ నా గతించిన భార్య.'

'మీరు మళ్లీ కళ్యాణం చేసుకోలేదా?'

'మంచి పిల్ల బీదపిల్ల దొరుకుతే చేసికోవాలనే వుంది. నిజానికి అదే నా భార్య చిట్టచివరి కోరిక కూడా.'

'ఓహ్! అలాగ!'

బైట ఎండ ఝూడించి కొడ్తోంది. అయినా నాగభూషణం ఎయిర్ కూల్డ్ గదిలో దాని ఛాయైనా లేదు. అతను శాంతి పక్కన కూర్చుంటూ.

'మీరీ వూర్లో ఎన్ని రోజాలుంటారు?' అడిగాడు.

'తెలీదు మిస్టర్ నాగభూషణం.'

'అదేమిటీ? అట్లా అంటున్నారు?'

'అవునండీ! మా కంపెనీకివే చివరి రోజులు. మాకు రోజుకి మూడు వేలు కలెక్షను వస్తే నిలబడగల్గుతాం. కంపెనీ ఇప్పుడు నష్టంలోకి జారిపోతోంది.' ఆమె ముఖంలో దైన్యం ఉట్టిపడ్తోంది. మిసమిసలాడ్తున్న ఆమె దేహంలోకి ఒక్కసారిగా ముసలితనం తొంగి చూసినట్లయింది.

'ఐతే కంపెనీ మూసేశాక మీరేం చేస్తారు శాంతీ?'

'కంపెనీ మూయకుండా ఉండేటందుకే నా శాయశక్తులా ప్రయత్నిస్తాను మిస్టర్ భూషణం.'

'ఎలా?'

'మీవంటి ఉదారులనుంచి కొంత అప్పు తీసికొంటాను.'

ఆ మాటతో నాగభూషణం మొగంలో రక్తం జారిపోయింది. ఐతే—ఈమె స్నేహానికి పరమార్థం ఇదన్న మాట. వెంటనే తేరుకుని నాగభూషణం తానింక లౌక్యం చూపాల్సిన పని లేదని తెలిసికొన్నాడు.

'నువ్వడిగాక సహాయం చేయక పోవడమేమిటి శాంతీ!' ఆమె భుజాలమీద చేతులు వేస్తూ అన్నాడు నాగభూషణం ప్రేమగా.

'చాలా థాంక్స్ మిస్టర్ నాగభూషణం, ఆ నమ్మకం నాకున్నది కాబట్టే నేను మిమ్మల్ని స్నేహితుల్నిగా చేసికొన్నాను.' అంటూ ఆమె లేచింది.

నాగభూషణం వెంటనే ఆమెతో బాటు లేచి—

'అప్పుడే లేచావేం శాంతీ! కాస్సేపిక్కడే

# ఏనిమల్ సైకాలజీ

విశ్రాంతి తీసికొని వెళ్లు!' అన్నాడు.

'లేదు మిస్టర్ భూషణం! ఇవేళ మ్యాటినీ కూడా వుంది.'

'ఐతే మళ్లీ ఎప్పుడు కలుస్తావు?'

'మీరెప్పుడు రమ్మంటే అప్పుడే.'

'వెరీగుడ్ స్నేహం అంటే అలా వుండాలి.' ఆమె చెక్కిళ్లమీద సున్నితంగా కొడ్తూ అన్నాడతను.

—అరే ఈమె చెక్కిళ్లమీద ఈ తేమ ఎక్కడిది— అతనామె చెక్కిళ్లని పరామర్శించి చూశాడు. శాంతి గబగబా వెళ్లిపోయింది...

ఆ మర్నాడు రాత్రి ఏడున్నరకి వచ్చింది శాంతి.

'ఫస్ట్ షో లేదా?' ఉత్సాహంగా అడిగాడు నాగభూషణం.

'నా పని ముగించుకొని వచ్చాను మిస్టర్ భూషణం.'

'భోజనం చేద్దామా?'

'ఈవేళప్పుడు భోజనం చేయడం అలవాటు లేదు'

'అవును. సర్కస్ కంపెనీవాళ్లు కదూ మీరు. మరిచేపోయాను. అవునుగానీ శాంతీ ఇలా రోబ్స్‌లోనే వచ్చారే.'

'అరరే మర్చిపోయాను. నా ఫీట్ అయిపోగానే ఇటే వచ్చాను'

'నీకీ పరధ్యానం నిన్నటినుంచే వచ్చిందా?' నవ్వుతూ అడిగాడు నాగభూషణం.

శాంతి తల దించుకొని ఏమో ఆలోచిస్తోంది

'ఆ రోబ్స్ మాత్రమెందుకు శాంతీ! తీసెయ్ వాటిని!'

ఆమె వాటిని తీసేస్తూ అంది.

'మా కంపెనీని నిలబెట్టాల్సిందిగా వేడుకొంటున్నాను మిస్టర్ భూషణం.'

రోబ్స్ లేకపోవడంచేత కనబడ్తున్న ఆమె అర్ధ నగ్న శరీరాన్ని ఆశతో చూస్తున్న నాగభూషణం ఉద్రేకంగా అన్నాడు.

'నీవంటి మంచి దాని స్నేహం నిలుపుకోవడానికి ఒక్క కంపెనీయే ఏం ఖర్మ— పది కంపెనీల్నయినా నిలుపుతాను మిసెస్ శాంతీ!' ఈ మాటలంటూ నాగభూషణం శాంతిని సమీపించాడు. శాంతి గబుక్కున లేచి నిల్చుని.

'పదండి! సర్కస్ షో చూద్దురు!' అని అన్నది.

'అప్పుడెందుకులే శాంతీ! ఇక్కడే కూర్చుందాం కబుర్లు చెప్పుకుంటూ' పరుగులెత్తుతున్న నదికెవ్వరో అడ్డుకట్ట వేసినట్లయి గిలగిల లాడ్తున్నాడు నాగభూషణం.

'కాదు మిస్టర్ భూషణం. ఇవేళ మా కంపెనీ అతనొకడు జీవితంలో మొదటిసారిగా రింగ్‌మాస్టర్ కాబోతున్నాడు. అది చూద్దురు రండి.'

అప్పటికే తనని నగ వ్యాక్రమించిన నాగభూషణాన్ని గట్టిగా బైటకుతోసి శాంతి రోబ్స్ వేసికొని బైటకు బయలుదేరింది. ఆమెతోబాటు అతనూ బయలుదేరాడు సర్కస్ గుడారానికి... సరిగ్గా అప్పుడే ఒక అందమైన యువకుడు రెండు పెద్ద పులుల మధ్యన మేక నొకదాన్ని నిలబెట్టాడు. బ్యాండ్ డ్రస్ కిందినుంచి ఆ దృశ్యాన్ని చూస్తున్న నాగభూషణంతో శాంతి చెప్తోంది.

'అతనే మా కొత్త ఏనిమల్ ట్రయినర్. ఎంతో అందంగా వున్నాడు కదూ మిస్టర్ భూషణం.'

నాగభూషణం ఆమెని అనుమానంగా చూస్తూ అడిగాడు.

'అతనేమైనా మీకు...'

నాగభూషణం మాటలకామె వెంటనే అడ్డు వస్తూ అన్నది.

'అతను నా కొడుకు!'

ఆ మాటతో నాగభూషణం ఉదిరి పడ్డాడు.

'మీ కంత వయస్సుందా?'

ఆ మాటలకి ఆమె నవ్వింది. ఒక్క నిముషం నిరుత్సాహ పడిపోయిన నాగభూషణం కాస్సేపటిలో కోల్పోయిన ఉత్సాహాన్ని పుంజుకుని అది అబద్ధమయి వుంటుందిలే అనుకుంటూ ప్రదర్శన చూస్తున్నాడు. మధ్యలో.

'అదేమిటే మీ అబ్బాయి పెద్దపులి నోట్లో తన తల దూరుస్తున్నాడు— మీకేం భయమనిపించడంలేదా?' వెక్కిరిస్తూ అన్నాడు నాగభూషణం.

'మా పెద్దాడికి నాకు తెలిసిన ఏనిమల్ సైకాలజీ అంతా నేర్పాను. జీవితంలో ఎన్నడూ ఏ జంతువూ వాణ్ని నమ్మి

మోసం చేయలేవు' గుండె నిబ్బరంతో, గర్వంతో, ఆత్మ విశ్వాసంతో ఆమె కళ్లు వెలిగినవి.

ఇంతలో ముసలి బఫూన్ వెళ్లి పెద్ద పులిబోటు తలమార్చినట్లు దూర్చబోయి గట్టుక్కున తన షర్టుని బైటకు లాగేసి దానిబోటు వేసాడు.

జనమంతా గందరగోళంగా నవ్వింది!

ప్రదర్శన అయిపోయింది నాగభూషణం శాంతిని ఆరాత్రి తన ఇంటికి రమ్మన్నాడు.

'వస్తాను కాని మీ సహాయం ఇవే ళే లభించాలి మాకు. అలా అవుతే రేపే మా మ్యానేజర్ వాళ్లు మరో నూరు వెళ్లి అక్కడ ప్రదర్శనకి ఏర్పాట్లూ అవీ చేసి కొని వస్తారు'

నాగభూషణం గొంతు ఉద్రేకంగా 'ఊ' కొట్టింది.

ఆమె దగ్గరలోవున్న ఎవరితోనో మళయాళంలో ఏమిటో చెప్పి నాగభూషణంతో బైలుదేరింది

చీకటి రాత్రి. గుండె బరువుగా మారి పోయింది. కారు ధ్వని అపశ్రుతుల మధుర సమ్మేళనంలా వుంది! నాగభూషణం కళ్లు కారు హెడ్‌లైట్లకన్నా తేజస్సుతో వెలిగి పోతున్నవి రోగమూ ముసలితనమూ లేని జవ్వని తనది కాబోతోంది. దాని కోసం తానెంత డబ్బు ఖర్చు చేయబోతుంటే మాత్రమేం? నిజంగా శాంతి ఎంత అందమైనది! ఆమె ఎంత పడుచుదనంలో వుంది! ఉడుపులు లేని ఆమె దేహం చూడ్డానికి దేవతలయినా దిగి రారా! ఇంతటి సౌందర్యాన్ని అనుభవించే అదృష్టం తనకి కొన్ని క్షణాల్లో లభించబోతోంది!

—కారు పోర్టికోలో ఆగింది

శాంతి చేయి పట్టుకొని నాగభూషణం పడల్లోకి వెళ్లాడు.

ఎయిర్ కూలర్ స్విచ్ ఆన్ చేశాడు

ఆ బాక్స్‌లోని నీళ్లల్లో ఒక సెంట్ స్ప్రే కావాలనే ఒలకబోశాడు!

చల్లని గాలితోబాటు గదినిండా పరిమళం!

ట్యూబ్‌లైట్ల వెలుతురులో శాంతి పాలరాతి విగ్రహంలా నిల్చుంది. నాగభూషణం ఆమెను దగ్గరకి లాగాడు... కాని ఆమెని జరుప లేకపోయాడు ... పాతేసిన ఇనుప స్తంభాన్ని దగ్గరకు లాక్కోబోయి, దాని స్థైర్యానికి, లాగినవాడే దాని దగ్గరకు జారిపోయినట్లుగా అతనే ఆమెదగ్గరకు జరిగి పోవాల్సి వచ్చింది. మనిషిలోని పెసరగింజంత అశక్తత కూడా ఇంతింతయి అంతంతయి మనిషిని మొత్తం కబళించి వేస్తుంది. నాగభూషణానికీ అలాగే అయింది! తాను శాంతిని ఒక్క అంగుళమైనా కదల్చలేకపోయాడు!— అన్న విషయం అతని ఉద్రేకాన్ని ఒక్క సగం కార్చేసింది!

ఆమె చెక్కిళ్లపై కన్నీరు!

నాగభూషణం తాను కోల్పోయింది తిరిగి పొందడానికి సువర్ణావకాశం లభించిందని వెంటనే గ్రహించాడు

'ఎందుకు శాంతీ! ఏడుస్తున్నావు?' ఆమె కన్నీటిని వేలితో తుడుస్తూ అడిగాడు నాగభూషణం.

'మీకు నేను కావాలా? నా సౌందర్యం కావాలా భూషణంగారూ.'

'రెండు కావాలి శాంతీ! అప్పుడే నా మనస్సుకి శాంతి!'

'రెండూ కోరుకునే సహృదయతే వుంటే నన్ను మీరు శాశ్వతంగా మీదాన్ని చేసికోండి భూషణంగారూ.' అతని గుండెలపై వాలిపోతూ అన్నదామె

నాగభూషణం తాను కోల్పోయింది పొందాడు ఇంక అనుభవించటం మాత్రమే పొందాలి. దానికిప్పుడు తొందరపడకూడదనే పాటి వివేకం అతనికి వుంది.

'అలాగే శాంతీ!'

ఇంతలో తలుపుల పై ఎవ్వరో తట్టారు.

శాంతి నాగభూషణాన్ని చూస్తూ అడిగింది.

'మిష్టర్ భూషణం! మా కంపెనీ దివాలా తీయకుండా వుండేటట్లు సాయం చేయండి. అలా అయితే నేనిక్కడ తృప్తిగా వుండిపోగలను'

'నీకెంత కావాలి శాంతీ?'

'ఒక్క లక్షరూపాయలు. అదీ దానంగా కాదు మిస్టర్ భూషణం! అప్పుగా! వడ్డీ లేని అప్పుగా!'

'వడ్డీ లేకపోవడమేమిటి? నీవు లభిస్తుండడమే దానికి వడ్డీ' అంటూ అతని లోని వ్యాపార బుద్ధి వెకిలిగా నవ్వింది. అంతలో మళ్లీ పడక గది తలుపులపై చప్పుడు!


'ఛీ! ఎవరీ పానకంలో పుడక' అంటూ నాగభూషణం తలుపులు తీయబోయాడు.

'ఉండండి! డబ్బులిచ్చి తలుపులు తీయండి! వాళ్లు మా వాళ్లే అయి వుంటారు'

'అలాగే' ట్రెజరీలోంచి డబ్బు తీసి ఆమె చేతిలోవుంచి తలుపు తీశాడు.

ఆ వచ్చింది ముసలి బఫూన్

అతని ముఖం వికారంగా వుంది. దవడలు పీక్కుపోయి వున్నవి గడ్డంమీద అక్కడక్కడ జింకపూత! తలపైన చిరిగిన— మాసిన హేటు. తల్లకిందులుగా తొడుక్కున్న కోటూ, మాసికలేసి కుట్టిన పైజామా—ఇదీ అతని వేషం!



అతను లోపలికి రాగానే శాంతిని చూశాడు. ఆమె చేతిలోని నోట్లని కూడా చూశాడు. వాటిని చూశాక కూడా అతని ముఖంలోకి కాంతి రాలేదు.

శాంతి అతణ్ని చూడలేక తల దించేసింది.

'నేను సర్కస్ బఫూన్ని'

'అది మీరు చెప్పాలా?' గేలి చేస్తూ అన్నాడు నాగభూషణం.

'అంతేకాదు. ఆయన మా కంపెనీ యజమాని కూడా' అన్నది శాంతి గంభీరంగా.

'అలాగా' ఆశ్చర్యపడ్తూ అన్నాడు నాగభూషణం.

'శాంతికి ఫీజ్ చేయాల్సిన టైమయింది. తీసికొని వెళ్ళడానికి వచ్చాను' అన్నాడు బఫూన్.

నాగభూషణం నిస్సహాయంగా శాంతి వంక చూశాడు!

'మీ రిక్కడే వుండండి నా ఫీజ్ కాగానే వచ్చేస్తాను అంతలోపల మా ప్రొప్రయిటర్ గారితో వడ్డీ లేకుండా ఈ డబ్బు ప్రామిసరీ నోట్ వ్రాయించుకోండి— వెళ్తా' అంటూ శాంతి బైటకు వెళ్లిపోయింది డబ్బుతో సహా.

*  *  *

# ఏనిమల్ సైకాలజీ

అలా డబ్బుతో వెళ్ళిపోయిన శాంతి తిరిగి నాగభూషణం దగ్గరికి రానే లేదు! మరేమయింది?? ఏమయిందీ అంటే...

ఆ సర్కస్ కంపెనీ ఒక రాష్ట్ర రాజధానిలో ప్రదర్శన ఇస్తున్న సంగతి తెలిసికొని కారు వేసుకొని అక్కడికి వెళ్ళాడు నాగభూషణం.

'ఓహో మీరా భూషణంగారూ! రండి! రండి! మీ సాయం వల్ల ఈ ఒక్క షోల్లోనే ఇరవయివేలు లాభం సంపాదించాం. పేరు మోసిన సర్కస్ ఆర్టిస్టుల్ని హైర్‌చేసి మా కంపెనీలో చేర్చుకొన్నాము! బీద ఆర్టిస్టుల జీవితాలకి స్థిరత్వం కల్గించాం' అంతలో లక్కడికేదో పనిమీద ముసలి బఫూన్ వచ్చి వెళ్ళాడు!

'ఆయనే నా భర్త' అన్నది శాంతి.

'ఏమిటీ?! ఇతనా నీ భర్త!'

'అవును ఆయనే నా భర్త. ఈ కంపెనీ భారమంతా ఆయనే మోసి మోసి ముసలివాడయ్యాడు, ఒక్క మీ షోల్లోనే నేనా భారాన్ని నా పైన వేసికొని ఆయనకి జీవితంలో ఒక్కసారైనా సాయం చేయగలానవనే తృప్తి మిగుల్చుకొన్నాను'

'అంతే కాదు. అవతలి వాళ్ళని మోసం చేయగలానవనే తృప్తి కూడా నీకు దక్కి వుండవచ్చు శాంతీ!' కోపంగా అన్నాడు నాగభూషణం.

శాంతి చిరునవ్వు నవ్వుతూ జవాబివ్వ లేదు.

అతనింకా రెచ్చిపోయి అన్నాడు.

'సమాధాన మివ్వవేం?'

ఆమె అప్పటికీ సమాధాన మివ్వలేదు.

'ఇది మోసం కాదూ! శాంతీ! మీరంతా మనుష్యుల్లో పొరపాటున పుట్టారు. ఛీ! ఛీ!' అన్నాడు నాగభూషణం కోపంగా.

దూరంగా శాంతి కొడుకు పెద్ద పులి నోట్లో తల దూర్చుతున్నాడు.

'అటు చూడండి భూషణం.. నా కొడుకు పెద్దపులి నోట్లో తల దూర్చాడు'

'అతనేం చేస్తే నా కెందుకు?' విసురుగా అన్నాడు నాగభూషణం.

'అలాగే నేనూ మీ జీవిత ముఖంలో నా శిరస్సునుంచాను ఆ పెద్ద పులేమో మానవత్వంతో నా కొడుకుని నమిలి మింగేయలేదు కాని మీరేమో నన్నూ నా సౌందర్యాన్ని నమిలి మింగేద్దామనుకొన్నారు!!!'

'ఛీ! ఛీ! చేసిన మోసం చాలక ఇంకా పుపన్యాసాలు కూడానా' కసిగా అన్నాడు నాగభూషణం.

'సర్కస్‌ని ఆనాటి సభలో మీరు దివ్యకళ లని పొగుడుతున్నప్పుడె అనుకొన్నాము' ఆమె అర్ధాంతరంలో ఆగింది

'ఏమని?' రెట్టించి అడిగాడతను.

'ఇలా అంటున్నది మానవుడు కాదు. మళ్లీ ఆగిందామె—


'మరి?'

'పశువని'

అవమానంతో నాగభూషణం మొఖం జేవురించింది,

'ఛీ! ఛీ!' అన్నాడతను నిస్సహాయంగా.

'చిన్నప్పటినుంచీ జంతువుల మనస్తత్వం తెలిసిన నేను వెంటనే మిమ్మల్ని తెలిసికొన్నాను జంతువులకి పశుబలంలాగే మీకు ధన బలం వుందని తెలుసు చావు బ్రతుకుల పొలిమేరలలో అనుక్షణం చావలేక బ్రతుకుతున్న మాకు అఖండమైన ఆత్మ విశ్వాసం వుంది. కాని మాకు లేనిదల్లా



అనాడు ఒక్కటే ! అది ధనం ! ధనం సృష్టించే తిండి ! అందుకే మిమ్మల్ని ఆశ్రయించాను' అన్నది శాంతి.

'కాదు మోసగించావు.'

'అవును మిమ్మల్ని మోసగించాను ఈ లైసెన్స్డు ఆత్మహత్యా ప్రయత్నాల కళని సర్కస్ అనే అందమైన పేరుతో పిలిచి నలుగురిలో మీకు దానిపై ఎంతో ప్రేమ వున్నట్లూ, మీకు ఆ కళాకారులపై ఎంతో సానుభూతి వున్నట్లూ నటించి నందుకుగాను మిమ్మల్ని అలా మోసగించాను'

'నువ్వు అడిగితే ప్రతిఫలం ఆశించకుండా డబ్బివ్వక పోయేవాడినా శాంతీ' తొక్కంగా అన్నాడు నాగభూషణం.

'మిస్టర్ భూషణం! ప్రతి వంచన చేయడానికి ప్రయత్నించకండి. మీరు చేసిన సాయానికి మేము మీకు సర్వదా కృతజ్ఞులం!'

దూరంగా సింహం పిల్లిలా శాంతి కొరడకు ముందర కూర్చుంది. అంతే కదూ మరి ?! మానవతముందు ఏశక్తి ఐనా తల వంచక తప్పదు.

'నాడబ్బు నాకు కక్కమని మీకు నోటీస్ ఇప్పిస్తాను.'

'ఆ తతంగం అంతా అయ్యే లోపల మీ డబ్బు అణాపైసల్తో మీకు వాపస్ ఇచ్చేస్తాము—కాని......' అర్థాంతరంగా ఆపిందామె

'ఆఁ కాని...?' అడిగాడు భూషణం

'కాని మీకు ఈ వడ్డీమాత్రం దక్కదు' అందుకు నేనెంతో విచారిస్తున్నాను మిస్టర్ భూషణం' అంటూ గలగలా నవ్వుతూ శాంతి అక్కడినుంచి పారిపోయింది!

దూరంగా సర్కిల్‌లో బఫూన్ ఏదో మోటు జోక్ వేస్తున్నాడు. జనం చప్పట్లు కొడుతున్నారు.

జీవితంలో ఒక్కొక్కప్పుడు మోటు దనం, మోసం, అబద్ధాలు కూడా రక్తి కడ్తాయన్నమాట ! ●

5—12—69

# డా॥ ఎస్. కె. పణికర్



జాతీయ సాగర శాస్త్ర పరిశోధనాసంస్థ (పాంజిం, గోవా) డైరక్టర్ డా ఎస్ కె పణికర్ గత 30 సంవత్సరాల నుంచీ సాగరశాస్త్రం ఓషనోగ్రఫీ), సాగరజీవశాస్త్రం, మత్స్య శాస్త్రంలో అపారమైన కృషి చేస్తూ, మన దేశంలో మత్స్య పరిశ్రమాభివృద్ధికి చాలా దోహదం చేశారు వీరు కొంత కాలం మద్రాస్ యూనివర్శిటీ జంతుశాస్త్ర పరిశోధనాలయానికీ, కేంద్ర సాగర మత్స్య పరిశోధనా కేంద్రానికి (మండపం, మద్రాస్ రాష్ట్రం) డైరెక్టర్ గానూ, భారత ప్రభుత్వానికి మత్స్య పరిశ్రమ సలహాదారుగానూ కూడా పని చేశారు.

డా కేశవపణికర్ 1913లో కొట్టాయం (కేరళ)లోపుట్టారు మద్రాస్ యూనివర్శిటీలో బి ఎ, (ఆనర్స్) మొదటిరాంక్‌లో ప్యాసయి, అక్కడే పరిశోధనలు జరిపి 1938లో డి. ఎస్. సి. డిగ్రీ తీసుకున్నారు 1938—43లో లండన్, కేంబ్రిడ్జి యూనివర్శిటీల్లోనూ, ప్లిమత్ సాగర జీవశాస్త్ర పరిశోధనా సంస్థలో లోనూ పని చేశారు వీరి పరిశోధక వ్యాసాలు 75 ఇవికాక భారతీయ భాషల్లో వ్యాసాలూ, ఇతర ప్రచురణలూ 50 ఉన్నాయి వీరి పరిశోధనల్ని గురించి, వారికి గలాతియా పతకం (డెన్మార్క్) ఎర్‌దొరాబ్జీతాతా బంగారు పతకం ఇచ్చారు

డా పణికర్‌కి జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ అనేక సన్మానాలు లభించాయి.

1959లో న్యూయార్క్‌లో జరిగిన ప్రథమ అంతర్జాతీయ సాగర శాస్త్ర మహాసభ లోనూ, 1966లో మాస్కోలో జరిగిన ద్వితీయ అంతర్జాతీయ సాగర శాస్త్ర మహాసభ లోనూ, ఒక విభాగానికి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇవిగాక అనేక అంతర్జాతీయ వైజ్ఞానిక సమావేశాల్లోనూ, ఐక్యరాజ్యసమితి నిపుణుల సంఘాల్లోనూ భారత ప్రతినిధిగా పని చేశారు.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ఆఫ్ ఇండియాకి డా. పణికర్ 1964—68లో కార్యదర్శి. ప్రస్తుతం ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కీ, ఇండియన్ జియోఫిజికల్ యూనియన్‌కీ ఉపాధ్యక్షులు, భారత జంతు శాస్త్ర సంఘానికి అధ్యక్షులు. ఇంకా ఇతర వైజ్ఞానిక సంస్థల్లో సభ్యులు.

పణికర్ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె.

—డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి.